క్లుప్తంగా

సమ్మె కాలపు ఒప్పందాలను నెరవేర్చాలి



నిరాహార దీక్షలో మున్సిపల్ కార్మికులు

నాయుడుపేట టౌన్ : సమస్యలు పరిష్కరించాలని గతంలో చేసిన సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలపై జీవో జారీ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. వారు శుక్ర వారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వ ర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వ ర్యంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. సీఐటీయూజిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, మండల కార్యదర్శి ముకుంద మాట్లాడు తూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డ్రమ్ సీడర్‌తో వరిసాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పత్రపల్లిలో శుక్రవారం టీవీఎస్ మోటారు సైకిల్ అనుబంధ సంస్థ శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు డ్రమ్ సీడర్‌తో వరిసాగుపై అవగాహన కల్పించారు. ఏడీఏ నాగార్జున సాగర్ మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో వరిసాగు చేస్తే సాగు ఖర్చు తగ్గడమేకాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సుజాత, కేవీకే శాస్త్రవేత్త రాజీవన, టీవీఎస్ సభ్యులు సతీష్, సాయిచరణ్, సురేష్ పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు హాజరైన క్రీడాకారులతో కోచ్‌లు

నాయుడుపేట టౌన్ : స్థానిక షాదీ మంజిల్ వద్ద శుక్రవారం నాయుడుపేట తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు నాయుడుపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి 55 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. కాకినాడలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు కోచ్ వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి నాయుడుపేటకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎ.వినోద్‌కుమార్, నవీన్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుకాణం గది నిర్మాణం నిలిపివేయాలి

దక్కిలి : దక్కిలిలో సర్వే నంబర్ 144 పొరంబోకు స్థలంలో గ్రామానికి చెందిన చెలికం నారాయణరెడ్డి అక్రమంగా దుకాణం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని, అడ్డుకోవాలని సర్పంచ్ శనగ వేమక్క శుక్రవా రం ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఆమె కథనం మేరకు.. చెలికం నారాయణరెడ్డి రేకుల షెడ్డును చెరువు పొరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించడం, చెరువు కట్ట అభివృద్ధి పనులకు అడ్డుగా ఉండడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తొలగించినట్టు తెలిపారు. అతనికి దక్కిలిలో రెండస్తుల ఇల్లు ఉందని, భార్యాభర్తలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారని తెలిపా రు. తాను ఈ దుకాణం ద్వారానే జీవనం సాగిస్తున్నానని, రేకుల షెడ్డును తొలగించడంతో బతుకుదెరువు కోల్పోయినట్లు కోర్టును అతను తప్పుదోవ పట్టించాడన్నారు. గత ఏడాది ఆగస్టు 8న గ్రామ తీర్మానంలో చెరువు దగ్గర అక్రమ నిర్మాణం చేపట్టకూడదని తీర్మానించినట్టు తెలిపారు. చెరువు కట్ట వద్ద నిర్మాణాలు చేపట్టవద్దని కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేశారని వివరించారు. అయినా మళ్లీ గ్రామ సభ తీర్మానం పెట్టి గదిని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

చిల్లకూరు : భర్త తనను పట్టించుకోకుండా పుట్టింటికే పరిమితం చేశాడన్న మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకుని తనువు చాలించిన ఘటన గురువారం రాత్రి బూదనం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బూదనం గ్రామానికి చెందిన కోటమ్మ 9 ఏళ్ల క్రితం గూడూరు మండలం, చెన్నూరుకు చెందిన ఆత్మకూరు సాయికుమార్‌ను పెళ్లి చేసుకుంది. ఒక బిడ్డ పుట్టిన తర్వాత రెండో పర్యాయం గర్భం దాల్చగా ఆమెను పుట్టింటికి పంపేశాడు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉంది. ఇటీవల సాయికుమార్‌కు పలు మార్లు తనను తీసుకు వెళ్లాలని కోరినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని తనువు చాలించింది. కేసు దర్యాప్తులో ఉంది.

ధాన్యం..దైన్యం



ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని రైతులు కల్లాల్లో అమ్ముకుంటూ ఉంటారు. కొంత మంది వారికున్న ఆర్థిక పరిస్థితి వల్ల అక్కడికక్కడే పచ్చి ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తుంటారు. మరి కొంతమంది ధాన్యాన్ని ఆరబెట్టుకుని ఆరు నెలల తర్వాత జనవరిలో మంచి ధరకు అమ్ముకుంటారు. ఈ ఏడాది ధాన్యం ధర అమాంతం పడిపోవడంతో రైతుల పరిస్థితి దైన్యంగా మారింది. గత ఏడాది జనవరిలో పుట్టి పాత ఒడ్లు రూ.30 వేల నుంచి రూ.31 వేల వరకు ధర పలికింది. ఈ జనవరిలో పుట్టి రూ.19 వేలకు కూడా అడిగే వారు లేరు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- అమాంతం పడిపోయిన ధాన్యం ధరలు
- గతేడాది పుట్టి రూ.30 వేలు, ప్రస్తుతం రూ.19 వేలు
- ధరల పతనంతో మగ్గుతున్న 1.75 లక్షల టన్నుల ధాన్యం
- లబోదిబోమంటున్న రైతులు

వాకాడు : తిరుపతి జిల్లాలో గత రబీ సీజన్‌లో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అందులో 2.6 లక్షల ఎకరాల్లో కేఎస్‌ఎం 1638, బీపీటీ 5204, ఎన్‌ఎల్‌ఆర్ 34449 లాంటి మేలు రకం సన్న ధాన్యం సాగు చేశారు. తద్వారా 8.11 లక్షల టన్నుల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది. కొంతమంది 6.36 లక్షల టన్నుల ధాన్యాన్ని కల్లాల్లోనే పుట్టి(850 కిలోలు) రూ.23 వేల చొప్పున విక్రయించారు. మిగిలిన రైతులు 1.75 లక్షల టన్నుల ధాన్యాన్ని వ్యయ ప్రయాసలకోర్చి ఆరబెట్టుకుని గోడౌన్లలో నిల్వ ఉంచుకున్నారు. అప్పట్లో పచ్చి ఒడ్లు పుట్టి రూ.24 వేలు ధర పలికినప్పటికీ ఇంకా మంచి ధర వస్తుందని ఆరు నెలలపాటు దాచిపెట్టుకున్నారు. ఆరబెట్టిన కూలీలు ఖర్చు, నెమ్ము శాతం, గోడౌన్ల బాడుగ తదితరాలతోపాటు అప్పటి ధరతో కలిపి పుట్టికి రూ.3500+రూ.23,000 అవుతంది. నిల్వ ఉంచిన ధాన్యం పుట్టి సన్నాలు రూ.30 వేల వరకు ధర పలుకుతుందనుకున్న రైతులు ఆశ నిరాశే అయింది. కనీసం రూ.19 వేలకు కూడా కొనే వారు లేరు. గడిచిన ఐదేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని రైతులు వాపోతున్నారు.

రైతులకు షాక్

తిరుపతి జిల్లాలో పండించే ధాన్యం చెన్నైలోని రెడ్ హిల్స్‌కు ఎగుమతి అవుతుంది. దక్షిణాది ప్రాంతాల్లో పండించిన ఎడగారు ధాన్యాన్ని మిల్లర్లు అధునాతన టెక్నాలజీతో తయారైన స్టీమింగ్ మెషిన్‌లో వేస్తారు. దీంతో అర గంటలోనే ధాన్యంలో ఉన్న నెమ్ము ఆవిరై పాత, కొత్త అన్న తేడా లేకుండా బియ్యం తల తల మెరుస్తుంది. ఈ కారణంగానే పాత ఒడ్లు కొనుగోలుకు వ్యాపారులు అంత ఆసక్తి చూపడంలేదు. స్టీమింగ్ బియ్యం మార్కెట్లోకి వస్తే నిల్వ చేసిన ధాన్యం ధర మరింత క్షీణించే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వం హయాంలో అధిక ఆదాయం

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ధరల కంటే మిల్లర్లు 20 శాతం అధికంగా చెల్లించి కొనుగోలు చేశారు. పచ్చి ఒడ్లకు కొనుగోలు కేంద్రాలు పుట్టి(850 కిలోలు) రూ.19 వేలకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ బయట మిల్లర్లు రూ.24 వేలకు కొనుగోలు చేయడం గమనార్హం. దీంతో రైతుకు ఎకరా సాగులో ఖర్చులు పోను రూ.50 వేల వరకు ఆదాయం వచ్చింది. అలాగే పాత ఒడ్లకు ఖర్చులు పోను దాదాపు ఎకరాకు రూ.70 వేలు మిగిలింది. ప్రస్తుతం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.



ధరలు పతనమవడంతో నిరాశతో ధాన్యం రాశిపై రైతు



రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టుతున్న రైతులు

గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లభించింది



గత ప్రభుత్వ హయాంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించింది. నాకు ఎకరా విస్తీర్ణంలో 4 పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. పుట్టి (850 కిలోలు) రూ.30 వేల చొప్పున రూ.1.20 లక్షలు ఆదాయం వచ్చింది. ఎకరాకు ఖర్చులు పోనూ రూ.65 వేలు మిగిలింది. ఇప్పుడు పుట్టి రూ.19 వేలకు కూడా అడిగేవారు లేరు.

- కోట్లపూడి శ్రీనివాసులు, కాశీపురం

అధికారులు చొరవ చూపాలి



నేను 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ధాన్యం నిల్వ ఉంచాను. పుట్టికి రూ.11 వేలు తగ్గింది. సాధారణంగా నిల్వ ఉంచుకున్న ధాన్యానికి డిసెంబర్, జనవరి మాసాల్లో మంచి ధరలు పలుకుతాయి. ఈ సారి ధరలు పతనం కావడంతో రైతు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో రైతులు నష్టపోలేదు.

- వల్లం బాలయ్య, వాకాడు

వృద్ధులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



వస్తువులు అందజేస్తున్న తంబిరెడ్డి మధుసూదన్‌రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో జీసెస్ ఫౌండేషన్ ఆశ్రమం, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు తంబిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి ప్రభాకర్‌రావు, మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా అడ్మిన్ హెడ్ వుడుము సుదర్శన్ రెడ్డి నిత్యావసర వస్తువులు అందజేశారు. చర్చి నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తామని మధురెడ్డి తెలిపారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకురాలు మునిరత్నమ్మ కృతజ్ఞతలు తెలిపారు. సుదర్శన్ రెడ్డి తన తండ్రి వుడుము సుబ్బరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మధ్యాహ్నం బిర్యాని పెట్టారు. వృద్ధులకు సేవ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్నిని అభినందించారు.

12 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

సైదాపురం : మండలంలోని తూర్పుపూండ్లలో శుక్ర వారం కోడి పందెం ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. నిందితుల నుంచి రూ.9,100లు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు

చిట్టమూరు (చిల్లకూరు) : ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు మంజూరు చేస్తోందని ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. చిట్టమూరు మండలానికి 23 యూనిట్లు మంజూరైనట్టు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 16లోగా ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కూటమి ప్రజావ్యతిరేక పాలనపై పోరుబాట



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ప్రిస్కిల్లా

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై మహిళలు ఈ నెల 21న రోసనూరు పంచాయతీ నుంచి పోరుబాట పట్టనున్నట్టు జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తెలిపారు. ఆమె శుక్రవారం చిల్లకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చెంబేడు, పెళ్లకూరులో రెండు మద్యం షాపులుండగా 112 బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించడంతో బెల్టు షాపులను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినా కూటమి నేతలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెన్నేపల్లిలో వున్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమను మూసేయాలని డిమాండ్ చేశారు. పెన్నేపల్లి సర్పంచ్ కుదిరి లక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా టీడీపీ నాయకుల అండతో ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో రెండో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. గ్రామస్తుల మధ్య చిచ్చు పెడుతున్న కంపెనీ జనరల్ మేనేజర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, సర్పంచులు పసల స్వప్న, నెలబల్లి కమలమ్మ, కుమారి కల్పన, ఎంపీటీసీలు సుజాత, సునీత, శైలజ, బాలాజమ్మ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిల్లకూరు : గూడూరు నుంచి తిరుపతి వైపు వెళ్లే రోడ్డులో వెందోడు- కొండాగుంట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్ర వారం సాయంత్రం ట్రాక్ మెన్ గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతనికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, తెల్లషర్టు, బ్లాక్ ప్యాంటు ధరించాడని పేర్కొన్నారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. ఆ వ్యక్తి రైలులో ప్రయాణించే సమయంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గూడూరు ఆస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

సైదాపురం: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ, ఎంపీడీవో పురుషోత్తం శివ కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల కింద రాయితీపై రుణాలు మంజూరు చేసిందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఏవో పి.హైమావతి మాట్లాడుతూ మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ తోకలపూడి గ్రామస్తులు మేత పొరంబోకు భూమిని అటవీ శాఖ అధికారులు ఆధీనంలో ఉన్నట్లు చెబుతున్నారని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ అటవీ శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈగ రమాదేవి, జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీలు తిరకాల భాస్కర్, ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు ఈశ్వరరాజు, వెంకటరమణయ్య, సుమతి, శిరసంబేటి పద్మమ్మ, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సర్వపాప హరణం.. ఉత్తర ద్వార దర్శనం



సైదాపురం : స్వామి వారి ఊరేగింపు



రాపూరు : గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణం అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. గోనుపల్లిలోని పెంచల నరసింహస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని తమ్మినపట్నంలోని కోదండరామస్వామి, వరగలిలోని కోదండరామస్వామి, ఏరూరులోని చెన్నకేశవస్వామి, చింతవరంలోని చెన్నకేశవస్వామి, కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

సైదాపురంలో..

సైదాపురం : మండలంలోని కృష్ణారెడ్డిపల్లి సమీపంలో నున్న వైకుంఠపురంలో వెలసిన శ్రీమహావిష్ణువు ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉదయం సుదర్శన హోమం నిర్వహించారు. శ్రీమహావిష్ణువు, శ్రీలక్ష్మీదేవికి శాంతి కల్యాణం చేపట్టారు.

వైకుంఠ రాజస్వామికి ప్రత్యేక పూజలు

కోట : స్థానిక తూర్పువీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ రాజస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. రాత్రి స్వామి వారి పల్లకీ ఉత్సవం చేపట్టారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : గూడూరులోని చెన్నెకేశవస్వామి, అలఘునాథస్వామి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, సొసైటీలోని వాలాయనందస్వామి, కనుమరాయి కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: ఆరూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శ నం కల్పించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఓజిలిలో..

ఓజిలి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మానమాలలోని సాయి మందిరం, కురుగొండ, ఓజిలి గ్రామాల్లోని నాగార్పమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : పట్టణంలోని మద్వెంకట రామమూర్తి, గాండ్ల వీధిలోని పాండురంగ స్వామి, షార్ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి, మన్నారుపోలూరులోని సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని బంగారుపేటలో ఉన్న కోదండరామస్వామి, కర్ణకమ్మ వీధిలో ఉన్న హరిహర క్షేత్రంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. వెంకటగిరి గ్రా మశక్తి పోలేరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ఆర్మేనుకండ్రిగలో అఖండ దీప భజన

దొరవారిసత్రం: ఆర్మేనుకండ్రిగలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేనాటి ధనుంజయరెడ్డి సహకారంతో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అఖండ దీప భజన చేపట్టారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వాకాడులో..

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం పట్టాభి రామచంద్రస్వామి, కొండూరుపాళెంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి, వాకాడులోని అలఘునాథస్వామి, తూపిలిపాళెంలోని రామ స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అన్నదానం చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం చంద్రబాబు కాలనీలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి, తుమ్మూరులోని కరిమాణిక్యస్వామి, వూహాలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి, తిమ్మాజి కండ్రిగ అభయ అనుగ్రహ వెంకటేశ్వస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కల్యాణోత్సవం, సుదర్శన యాగం చేపట్టారు.



వూహాలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిల్లకూరు : కలవకొండలో ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి



గూడూరురూరల్ : గ్రామోత్సవంలో వాలాయనందస్వామి వారు



వెంకటగిరి రూరల్ : కోదండరామస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

చిల్లకూరు : సమస్యలు పరిష్కరించే వరకు కొనసాగిస్తామని పోరాటం చేస్తామని గూడూరు మున్సిపల్ కార్మికులు తెలిపారు. వారు శుక్రవారం సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గతంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చారు. అప్పట్లో వారితో చర్చించిన అధికారులు, ప్రభుత్వం సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత పట్టించుకోలేదు. ఈ క్రమంలో వారు రిలే దీక్షలకు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేసే కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. జీవో ఎంఎస్ 36ను వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ పరిహారం చెల్లించాలని, పనిముట్లు, రక్షణ కవచాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ జనాభా ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



హరిదాసుల వేషధారణలో విద్యార్థులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శుక్రవారం కరస్పాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన హరిదాసు, రైతులు, పల్లెటూరి వెంకి వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆయన మాట్లాడుతూ గతంలో సంక్రాంతి పండుగను వారం రోజులు నిర్వహించే వారిని తెలిపారు. ప్రస్తుతం మూడు రోజులు మాత్రమే జరుపుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు రఫీ, శ్రీరజనీ, భవాని, హరిత, యామిని, ధనశ్రీ, సోనియా, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

శని త్రయోదశికి ఏర్పాట్లు

నాగలాపురం : సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో లత తెలిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు.